

నర్సింహబస్తీలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు ఘన నివాళి

నల్లకుంట/రాంనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అన్ని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం పీవీ నర్సింహారావు జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. నల్లకుంట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి. లక్ష్మణ్ ఆధ్వర్యంలో నర్సింహబస్తీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పి.సుబ్రహ్మణ్యం, సీ.హెచ్. మురళీకృష్ణ, ధనార్జున్‌రెడ్డి, ఎడ్ల నరేందర్‌రెడ్డి, శరత్ ముదిరాజ్, సంజయ్, మురళి, శ్రవణ్ తదితరులు పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పీవీ విగ్రహం వద్ద టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, కాంగ్రెస్ నాయకులు ఎస్. హరినాథ్‌రెడ్డి, దేవిరెడ్డి విజితారెడ్డి నివాళులర్పించారు. నెక్లెస్ రోడ్‌లోని పీ.వీ. ఘాట్ వద్ద అంతర్జాతీయ వైశ్య సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్, పీ.వీ. మనువడు పీ.వీ. కశ్యప్, మాతా వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు మారం సురేష్‌బాబు, ఆదిత్య, ఉదయ్‌కుమార్, శ్రవణ్‌కుమార్ తదితరులు నివాళులర్పించారు. శివం రోడ్‌లోని శ్రీధర్ ప్లాజాలో ప్రముఖ కవి సి. రామకృష్ణ చంద్రమౌళి, సాహితీవేత్తలు గిరిజారాణి, ప్రవీణ్, కొండయ్యయ, వి. రామ్మూర్తి, పి. బడేసాబ్ పాల్గొని పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గ్రూప్-1, 2, 3, 4, టీచర్ పోస్టులను పెంచాలి



సీఎస్ శాంతకుమారికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్ కృష్ణయ్య

రాంనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 పోస్టులు, టీచర్‌పోస్టులు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 2 లక్షల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో 25వేల టీచర్‌పోస్టులను భర్తీచేయాలని కోరినట్లు తెలిపారు. గ్రూప్ 1 సర్వీస్ కింద 503 పోస్టులు మాత్రమే ప్రకటించారని, కాని డైరెక్ట్‌రిక్రూట్‌మెంట్ కోటా పోస్టులు 1600 ఉన్నాయన్నారు. వీటిని కూడా భర్తీ చేయాలని అన్నారు. గ్రూప్ 2 సర్వీస్ కింద 783 పోస్టుల మాత్రమే భర్తీ చేశారు. వాటిల్లో మొత్తం 2200 పోస్టులు, గ్రూప్ -3లో పోస్టులు కేవలం 1383 మాత్రమే ప్రకటించారని, మొత్తం 3వేలకు పైగా ఖాళీలు, గ్రూప్ 4లో 25వేలకుపైగా పోస్టులు ఉంటే కేవలం 8500 మాత్రమే ప్రకటించారని, పూర్తి ఖాళీలను భర్తీ చేయాలని సీఎస్‌ను కోరినట్లు తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్ల పట్ల సీఎస్ సానుకూలంగా స్పందించినట్లు కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు గుజ్జకృష్ణ, జిమల్లేష్‌యాదవ్, వేముల రామకృష్ణ, మోడి రామ్‌దేవ్‌తదితరులుపాల్గొన్నారు.



రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్‌చైర్మన్ చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ అధికారుల సంఘం నేతలు

వ్యవసాయ అధికారుల సమస్యలను పరిష్కరించాలి

రాంనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న వ్యవసాయ అధికారుల సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరారు. శుక్రవారం తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్‌చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. వ్యవసాయ అధికారుల బదిలీలు, పదోన్నతులు, మొబిలిటి ఆలవెన్స్‌లు, జీవో నెంబర్ 317 సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా కోరామన్నారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ బి. కృపాకర్‌రెడ్డి, నాయకులు, రవీందర్, శ్రీనివాస్‌గౌడ్, జి. కృపాకర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, వికాస్‌పటేల్, కరుణాకర్, హరి, ప్రసాద్, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ కమిషనర్ అమ్రపాలికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు

అంబర్‌పేట నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

అంబర్‌పేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ అమ్రపాలిని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అమ్రపాలిని శుక్రవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, బి. పద్మతో కలిసి ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించి పెండింగ్ పనులపై కమిషనర్‌తో చర్చించామన్నారు. ఛేనెంబర్ ఫ్లైఓవర్ పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో రోడ్లపై నీరు నిలిచిపోయి ప్రజలకు ఇక్కట్లను కల్పిస్తుందన్నారు. కమిషనర్ చొరవ తీసుకుని ఆయా పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు వెంకటరెడ్డి, అంజనేయులు, మహేష్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

ఎన్టీఆర్‌తో పోల్చుకోవడం కేసీఆర్‌కు తగదు

- టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా

రాంనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గడచిన అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో తెలంగాణలో ఘోర పరాభావం చెందిన కేసీఆర్.. ఎన్టీఆర్ లాగా మనకూ మంచి రోజులు వస్తాయని తనను ఎన్టీఆర్‌తో పోల్చుకోవడం తగదని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. శుక్రవారం టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎంగా కేసీఆర్ ప్రజల నమ్మకాన్ని కోల్పోవడం వల్లనే చిత్తుగా ఓడించారని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎన్టీఆర్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై ఏనాడు నోరు విప్పని కేసీఆర్.. నేడు తన రాజకీయ లబ్ధికోసం ఎన్టీఆర్ పేరు వాడుకోవడం తగదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎన్టీఆర్‌ఘాట్ అభివృద్ధి, ట్యాంక్‌బండ్‌పై ఎన్టీఆర్ చేపట్టిన మహనీయుల విగ్రహాలను కేసీఆర్ సంరక్షించలేకపోయారని, ఎన్టీఆర్ గార్డెన్‌ను కూడా నిర్వీర్యం చేశాడని ఆరోపించారు. కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది ఎన్టీఆర్ అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి. బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వాలు తమ వైఖరి తెలపాలి'

రాంనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ట్రిపుల్ తలాక్, మహిళా బిల్లు, రామమందిరం, ఆర్టికల్ 370 రద్దు వంటి చరిత్రాత్మక నిర్ణయాలను చేసింది. కానీ వర్గీకరణ వద్దకు వచ్చేసరికి వివక్ష ప్రదర్శిస్తుందని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. వర్గీకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరి తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీల వైఖరికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జూలై 7న వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద నిరసన దీక్ష కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. శుక్రవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 100 రోజుల్లో చేస్తామని ఇప్పటికీ మాదిగలపై వివక్షను చూపుతుందని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రమేష్, గణేష్, భాస్కర్, హుస్సేన్, శ్రీను, యాదగిరి, వేణు, వెంకట్, లక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

మోదీ.. మద్దతు ధరలపై చట్టం చెయ్..

- రైతులకిచ్చిన హామీని ప్రధాని నిలబెట్టుకోవాలి
- లేదంటే పోరాటం ఉధృతం: సంయుక్త కిసాన్ మోర్చా



రైతులపై ప్రయోగించిన తుపాకి తూటాలను, బాష్పవాయు గోళి, రాకెట్ బాంబులను చూపిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

పంజాగుట్ట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సాగు చట్టాలను ఉపసంహరించుకునే సమయంలో రైతులకు ప్రధాని మోదీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్ చేసింది. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని, హరియాణ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ప్రచారం చేస్తామని హెచ్చరించింది. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన రైతుల మద్దతు కూడగట్టేందుకు సంయుక్త కిసాన్ మోర్చా చేపట్టిన యాత్ర హైదరాబాద్ చేరుకున్న సందర్భంగా శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశంఏర్పాటు చేశారు. మోర్చా జాతీయ కన్వీనర్ జగ్జీత్‌సింగ్ దలైవాలా, జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లమల వెంకటేశ్వరరావు, దక్షిణ భారత రాష్ట్రాల సమన్వయకర్త కె.శాంతకుమార్, రైతు నాయకుడు పి.చెంగల్‌రెడ్డి, వివిధ రాష్ట్రాల నాయకులు మాట్లాడారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష ఎంపీలతో పాటు ఎన్డీఏలోని బీజేపీయేతర ఎంపీలను కలిసి వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. రైతుల సమస్యలపై ప్రైవేటు బిల్లు పెట్టాలని కోరుతామని చెప్పారు. కనీస మద్దతు ధరపై చట్టం కోసం ఫిబ్రవరి 13 నుంచి 4 చోట్ల నిరసనలు చేస్తున్నామని, 125 రోజులకు పైగా వేలాది మంది రైతులు రోడ్డెక్కుతున్నారని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహిస్తున్నామని, వర్షాకాల పార్లమెంటు సమావేశాలకు ముందు ఢిల్లీలో రెండు భారీ సదస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రైతుల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించడాన్ని స్వాగతించారు. సాగు చట్టాలపై నిరసనల సందర్భంగా రైతులపై ప్రయోగించిన తూటాలు, బాష్పవాయు గోళాలను సమావేశంలో ప్రదర్శించారు. అభిమన్యు కోహర్, లక్వీందర్‌సింగ్ (హరియాణ), పీఆర్ పాండ్యన్ (తమిళనాడు), సూర్జిత్‌సింగ్ (యూపీ), జాఫర్‌ఖాన్, సుఖ్‌జిత్‌సింగ్ (ఢిల్లీ), గోవింద రెడ్డి (కర్ణాటక) తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచీకరణతో వ్యాపార వాణిజ్య రంగాలు సమగ్రాభివృద్ధి

జాతీయ సదస్సులో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మినారాయణ



సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మినారాయణ

బర్కత్‌పుర, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచీకరణతో వ్యాపార వాణిజ్య రంగాలు సమగ్రాభివృద్ధి సాధిస్తున్నాయని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మినారాయణ పేర్కొన్నారు. యువతకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఆయన అన్నారు. ఛాదర్‌ఘాట్ చౌరస్తాలోని కేడీయా కళాశాలలో ఆర్‌జీ కేడీయా కాలేజ్ ఆఫ్ కామర్స్ ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఐసీఎస్ఎస్ఆర్, ఎస్ఆర్‌సీ, టీజీసీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో 'భవిష్యత్ వ్యాపార ధోరణులు-నూతన ఆవిష్కరణలు' అంశంపై రెండు రోజులపాటు జాతీయ సదస్సును శుక్రవారం నిర్వహించారు. తొలి రోజు సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన సదస్సును ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యాపార వాణిజ్య రంగాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయని భారత్ అభివృద్ధికి మరిన్ని కొత్త పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఓయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ రాములు, ఓయూ డీన్ ప్రొఫెసర్ వెంకటయ్య, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ సుధ, బద్రుకా విద్యా సంస్థల చైర్మన్ లక్ష్మినివాస్‌శర్మ, హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు జయవంత్‌నాయుడు, ఎస్‌బి కాబ్రా, రాముల్ ముద్ర, పింకల్ పటేల్, శ్రీకుమార్‌జైన్, మహేష్‌కేడియా, సుపిత్‌కాబ్రా తదితరులు ప్రసంగించారు. సదస్సు కన్వీనర్ వందన సాంబ, సంయుక్త డైరెక్టర్ రాంచంద్రమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సావనీర్‌ను ఆవిష్కరించారు.

కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలి: రమణ

రాంనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.వి. రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం గోల్కొండ చౌరస్తాలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వృత్తిలో ప్రమాదవశాత్తు చనిపోయిన గీతకార్మికులకు ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సేఫ్టీ రోప్ ఇచ్చి రక్షణ కల్పించాలన్నారు. జీవో 560 ప్రకారం 5 ఎకరాల చొప్పున భూమి ఇవ్వాలన్నారు. ట్యాంక్‌బండ్‌పై ఆగస్టు 18లోపు సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు ఆయన పేరు పెట్టాలని అన్నారు. 50 ఏళ్ల దాటిన ప్రతి గీత కార్మికుడికి రూ.4 వేల పెన్షన్ ఇవ్వాలని, ఏజెన్సీ ఏరియాలో సొసైటీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు జయరాములు, వెంకటనర్సయ్య, జి. వెంకన్న, పి. వెంకటమల్లయ్య, పి. అచ్చాలు, సీతారాములు, రమేష్‌గౌడ్, అరుణ్‌కుమార్, అంజిబాబు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

ముషీరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కళాధర్‌నగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్టు శ్రీనివాస్ కుమార్ కోరారు. ముషీరాబాద్ డివిజన్.. కళాధర్‌నగర్‌లో ఫుట్‌పాత్ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి అనుమతులు లేకుండా నాలుగు అంతస్తుల భవన నిర్మాణం చేపడుతున్నాడని కళాధర్‌నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌కుమార్ మాట్లాడూతూ కాలనీ లేఅవుట్‌కు విరుద్ధంగా ప్రభుత్వ స్థలం ఆక్రమించి భవనం నిర్మిస్తున్నారని, ఇదే విషయాన్ని అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో కళాధర్‌నగర్ యూత్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

సివరేజీ పైపులైన్ నిర్మాణానికి రైల్వే అధికారుల అనుమతి

నల్లకుంట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సివరేజీ పైపలైన్ నిర్మాణాని రైల్వే అధికారులు అనుమతి ఇచ్చారు. దక్షిణమధ్య రైల్వే, జీహెచ్‌ఎంసీ అధికారులు కిషోర్, క్రాంతి, శ్రీకాంత్‌లతో కలిసి కార్పొరేటర్ యాకర అమృత శుక్రవారం నల్లకుంట డివిజన్‌లో సత్యానగర్‌ను అనుకుని ఉన్న రైల్వే ట్రాక్ ప్రాంతాన్ని సందర్శించారు. రైల్వే ట్రాక్ పక్కన సీవరేజీ పైపులైన్ ఉందని, రైల్వే ట్రాక్ నుంచి సివరేజీ పనులపై జీహెచ్‌ఎంసీ అధికారులు... రైల్వే అనుమతి కోరగా వారు పెండింగ్‌లో పెట్టారన్నారు. రైల్వే డైరెక్టర్లు, ఐఓడబ్ల్యూ అధికారులతో చర్చించగా వారు అంగీకరించడంతో సత్యానగర్ బస్తీలో సివరేజీ పైపులైన్ పనులను ప్రారంభించామని కార్పొరేటర్ తెలిపారు.

ఆనంద్‌రావుకు ఉద్యోగం ఇవ్వాలి: గిరిజన శక్తి అధ్యక్షుడు

రాంనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం ఆనంద్‌రావుకు ఉద్యోగం ఇచ్చి ప్రమోషన్ కల్పించాలని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు, ఓయూ జేఏసీ అధ్యక్షుడు శరత్‌నాయక్ కోరారు. శుక్రవారం నారాయణగూడలోని ఐపీఎం కార్యాలయంలో డైరెక్టర్ శివలీలను కలిసిన గిరిజన బృందం నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం రెండు రాష్ట్రాల్లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల విభజన 2022లో జరిగిందన్నారు. తెలంగాణకు చెందిన ఆనంద్‌రావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌గా అధికారిగా చేశారు. ఉద్యోగుల విభజనలో భాగంగా ఆయన తెలంగాణకు వచ్చి జరిగి 22 నెలలు కావొస్తున్నా ఆనంద్‌రావుకు ఉద్యోగం ఇవ్వకుండా ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. జీవోనెంబర్ 106 ప్రకారం ఆనంద్‌రావుకు ఉద్యోగం ఇవ్వాలని హైకోర్టు కూడా సూచినట్లు ఆయన తెలిపారు. ఆనంద్‌రావు దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాబట్టే ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆనంద్‌రావు న్యాయం జరిగేలా చూస్తానని డైరెక్టర్ శివలీల హామీ ఇచ్చారని శరత్‌నాయక్ తెలిపారు. ఆయన వెంట గిరిజనశక్తి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బునాయక్, రాష్ట్ర చీఫ్ కో-ఆర్డినేటర్ రమేష్‌రాథోడ్, ఓయూ అధ్యక్ష కార్యదర్శులు హనుమంత్‌నాయక్, సతీష్‌నాయక్, సైఫాబాద్ కళాశాల అధ్యక్షులు మౌలానా నాయక్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్‌నాయక్ ఉన్నారు.

బొగ్గుగనుల వేలం పాటను నిలిపివేయాలి: సీపీఎం



ముషీరాబాద్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ముషీరాబాద్/గోల్నాక,, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బొగ్గుగనుల వేలంపాటను నిలిపి వేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీజీ నరసింహారావు డిమాండ్ చేశారు. సింగరేణికే నేరుగా గనులు కేటాయించాలని ఆయన అన్నారు. శుక్రవారం సీపీఎం ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ముషీరాబాద్ చౌరస్తాలో, అంబర్‌పేట జోన్ కన్వీనర్ ఎం.మహేందర్ ఆధ్వర్యంలో అంబర్‌పేటలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు మాట్లాడుతూ బొగ్గుగనులను వేలం పాట వేసి తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు బొగ్గుగనులను కేటాయించకుండా ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేలం వేస్తుందని, సింగరేణి కూడా ప్రైవేటు సంస్థలతో వేలం పాటలో పోటీపడాలని నిర్ణయించడం అత్యంత దారుణమన్నారు. బొగ్గుగనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణకు అన్యాయం జరగకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఎం. దశరథ్, నగర కమిటీ సభ్యులు వెంకటేష్, నాయకులు పద్మ, రమేష్, భాషా, విమల, అంబర్‌పేట జోన్ నాయకులు జి.రాములు, ఎల్.సోమయ్య, అశోక్, నర్సింగ్ రావు, ధర్మ, తిరుపతి, వీర్య, శీను, అంజయ్య, వెంకన్న, పాషా తదితరులు పాల్గొన్నారు

దోమల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి: కార్పొరేటర్

అంబర్‌పేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దోమల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ సూచించారు. శుక్రవారం అంబర్‌పేట సీపీఎల్ ప్రభుత్వ పాఠశాలలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో దోమల నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చుట్టు పక్కల మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుశీల, ఎంటమాలజీ అధికారులు దుర్గాప్రసాద్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ముసుగు తొలగేనా..?

- ఉద్యోగ సంఘాలతో మేయర్ చర్చలు

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో విగ్రహాల ముసుగు తొలగించే దిశగా అడుగులు పడుతున్నాయి. శుక్రవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సంస్థలోని ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేసేందుకు వచ్చిన వారితో విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి నిర్దిష్ట అభిప్రాయం చెప్పాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ఆయన విగ్రహం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేయాలని అప్పటి స్టాండింగ్ కమిటీలో నిర్ణయించారు. విగ్రహాన్ని తయారు చేయించి మేయర్ కార్యాలయం గేటు వైపు ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ కార్యక్రమం జరగకముందే.. నాడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పోటీగా మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలను తీసుకువచ్చి వైఎస్ విగ్రహం పక్కన పెట్టారు. ఇది వివాదాస్పదం కావడంతో మూడు విగ్రహాలకు ముసుగులు కప్పి ఉంచారు. దాదాపు దశాబ్దంన్నర కాలంగా విగ్రహాల ముసుగులు అలానే ఉన్నాయి. సున్నిత అంశం కావడం.. కేసు కోర్టు విచారణలో ఉండడంతో వాటిని ఎవరూ ముట్టుకోలేదు. ముసుగులతో విగ్రహాలు ఉండడం ఇబ్బందికరంగా ఉందని భావించిన మేయర్ ముసుగుల తొలగింపునకు ఉపక్రమించారు. ఈ విషయంపై ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించారు. కార్యాలయ ప్రాంగణంలోని మరోచోట విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు అభిప్రాయం తీసుకున్నారు. గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తే చాలని కొందరు చెప్పగా.. ఇంకొందరు మూడు విగ్రహాలు ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయంపై ఏకగ్రీవ నిర్ణయంతో రావాలని.. మరోసారి సమావేశం నిర్వహించనున్నట్టు విజయలక్ష్మి తెలిపారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కోదండరామ్

సమాజానికి ఉపయోగకరమైన పుస్తకాలు మరిన్ని రావాలి: కోదండరాం

చిక్కడపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సమాజానికి ఉపయోగకరమైన పుస్తకాలు మరిన్ని రావాలని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొ. కోదండరామ్ అన్నారు. సిటీసెంట్రల్ లైబ్రరీలో శుక్రవారం రాత్రి డా. ఎంఏ మాలిక్ రాసిన 'భారత ఆర్థిక వ్యవస్థ' పుస్తకావిష్కరణ సభ జరిగింది. హాజరైన కోదండరామ్ మాట్లాడుతూ టీచర్ అంటే చెప్పడమే కాదు రాయడం కూడానన్నారు. మాలిక్ పుస్తకంలో లోతైన అవగాహన ఉందన్నారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొ. లింబాద్రి మాట్లాడుతూ తనకు తెలిసిన సమాచారాన్ని సులభమైన భాషలో ప్రజలకు అందించాలనే తపన గల వ్యక్తి మాలిక్ అన్నారు. డా.మాలిక్, మాట్లాడుతూ పోటీపరీక్షలకు సన్నద్ధం ఎలా అవ్వాలో పుస్తకంలో సవివరంగా వివరించానని, ఈ పుస్తకం చాలా ఉపయోగపడుతుందన్నారు. అభ్యర్థులకు మెదడుకు మించిన భారం మోపడం నాకిష్టం ఉండదన్నారు. చిన్న పుస్తకంలో వీలైనంత ఎక్కువ సమాచారం పుస్తకంలో ఉంటుందని అన్నారు.

అత్యాచారం కేసులో మాజీ ఆర్మీ జవాన్‌కు 20 ఏళ్ల జైలు



పెరియాటీ శ్రీధరన్

రెజిమెంటల్‌బజార్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన కేసులో మాజీ ఆర్మీ జవాన్‌కు 20ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ పోక్సో స్పెషల్ సెషన్స్ జడ్జీ తీర్పు వెలువరించారు. మార్కెట్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని ఓ అనాథ శరణాలయంలో ఉంటున్న బాలిక 2017లో టైలరింగ్ శిక్షణకు వెళ్లివస్తూ సికింద్రాబాద్ బస్టాప్‌లో కూర్చొంది. ఆమె దగ్గరికి ఆర్మీలో జవాన్‌గా పదవీవిరమణ పొందిన యాప్రాల్‌కు చెందిన పెరియాటీ శ్రీధరన్(59) బైక్‌పై వచ్చి భోజనం చేశావా అంటూ పలకరించి బాలికను బలవంతంగా హోటల్‌కు తీసుకెళ్లి భోజనం చేయించాడు. అనంతరం లాడ్జీకి తీసుకెళ్లి అత్యాచారం చేసి ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి సికింద్రాబాద్ మనోహర్ థియేటర్ దగ్గర వదిలేసి వెళ్లిపోయాడు. శరణాలయం హెల్త్‌వర్కర్ ఆరా తీయగా అత్యాచారం జరిగిన విషయం చెప్పింది. దీంతో అప్పట్లో (2017 జూలైలో) మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోర్టులో విచారణ అనంతరం పోక్సో స్పెషల్ సెషన్స్ జడ్జీ పుష్పలత నిందితుడికి 20ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.20వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

బోనాల నిధులకోసం దరఖాస్తు చేసుకోండి

- ఆఖరు తేదీ జూలై 3

చిక్కడపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలకు సంబంధించి నిధుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కోరారు. ఇందుకోసం టెంపుల్ లెటర్‌ప్యాడ్ పైన దరఖాస్తు చేయాలని, రెండు ఆలయ ఫొటోలు, టెంపుల్ బ్యాంక్ అకౌంట్‌నెంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌తో నింపి దరఖాస్తు చేయాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని ఉత్సవ కమిటీలు గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లేదా కాచిగూడలోని తుల్జా భవన్‌లోని దేవాదాయ, ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు పత్రాలను జూలై 3వ తేదీ లోపు అందజేయాలన్నా ఇతర వివరాలకు 93922 22117(మచ్చకుర్తి ప్రభాకర్) ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

1 నుంచి సాహితీ సమాలోచన సప్తాహం

చిక్కడపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జూలై 1 నుంచి 7వ తేదీ వరకు సాహితీ సమాలోచన సప్తాహం నిర్వహిస్తున్నారు. శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ విశ్రాంత వీసీ, ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ రచించిన భిన్న సాహితీ ప్రక్రియలపై వారం రోజులపాటు సాహితీ సమాలోచన సప్తాహం త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుపుతున్నట్లు గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి శుక్రవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. జూలై 1న ఇనాక్ కథానికా సాహిత్యం, 2న పరిశోధన సాహిత్యం, 3న కవితా సాహిత్యం, 4న నవలా సాహిత్యం, 5న నాటకసాహిత్యం, 6న విమర్శన సాహిత్యం, 7న అనువాద సాహిత్యంపై వరుసగా ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, డా. ఏనుగునరసింహారెడ్డి, డా. డి.సురేఖ, డా.పాటిబండ్ల ఆనందరావు, డా.కోయి కోటేశ్వరరావు, డా.విజయభాస్కర్ ప్రసంగాలు చేస్తారన్నారు. గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో రోజూ సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సులలో శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

బర్కత్‌పుర, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సులలో శిక్షణకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన నేషనల్ స్కిల్ అకాడమి ఆధ్వర్యంలో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సులలో శిక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ శ్రీమాన్‌రెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ. పాలిటెక్నిక్ డిప్లొమా అభ్యర్థులు అర్హులని తెలిపారు. జూలై 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 9505800050 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

బర్కత్‌పుర, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఫలక్‌నామా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసంతకుమారి తెలిపారు. కామర్స్, ఆరబిక్, ఆంగ్లం, తెలుగు, హిస్టరి, రాజనీతిశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, గణితం సబ్జెక్టులను బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పీజీలో కనీసం 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులు సాధించి ఉండాలని సూచించారు. పీహెచ్‌డీ, సెట్ నెట్ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, అర్హులైన అభ్యర్థులు జూలై 3వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు తమ దరఖాస్తులను ఫలక్‌నామా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు 93911 52118, 98493 45494 ఫోన్ నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

సికింద్రాబాద్ నుంచి తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీకి బస్సు

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం సికింద్రాబాద్ నుంచి తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీ వరకు జూలై 1వ తేదీ నుంచి బస్సును ప్రారంభించనట్లు ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. రాణిగంజ్ డిపో నుంచి రూట్ నెంబర్ 90/253టి నెంబర్‌తో బస్ సర్వీస్ నడుస్తుందని తెలిపారు. బస్సులు సికింద్రాబాద్, తార్నాక, ఎన్‌జీఆర్ఐ, సర్వే ఆఫ్ ఇండియా, నాగోల్ మెట్రో స్టేషన్, సాగర్ క్రాస్‌రోడ్స్, చంపాపేట క్రాస్‌రోడ్స్, బార్కస్, పహాడిషరీఫ్, తుక్కుగూడ, ఇమాంగూడ మీదుగా ఫ్యాబ్‌సిటీకి చేరుకుంటాయని తెలిపారు. ఫ్యాబ్‌సిటీలో పనిచేస్తున్న వారి సౌకర్యార్థం ఈ సర్వీసును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

నేడు బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట ఆమ్ ఆద్మీ పార్టీ నిరసన దీక్ష

కవాడిగూడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్టుకు నిరసనగా 2 నెల 29న (శనివారం) తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష కార్యక్రమం చేపడుతున్నామని తెలంగాణ ఆప్ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ చెప్పారు. శుక్రవారం దోమలగూడలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం... తన రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ-1, ఆజామాబాద్ డివిజన్‌ల పరిధిలో శనివారం విద్యుత్‌సరఫరా ఉండదని సీటీడీఏడీఈలు ప్రేమానంద్ పాయ్, విజయభాస్కర్‌తెలిపారు. కవాడిగూడ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11గంటల నుంచి 11.30 వరకు, గగన్‌మహల్, ఏవీ కాలేజీ పరిధిలో 11.30 నుంచి 12 వరకు, గుల్షన్‌నగర్, తాళ్లబస్తీ పరిధిలో 12.00 నుంచి 12.30 వరకు, సాయిబాబా టెంపుల్, నారాయణగూడ పరిధిలో 11 గంటల నుంచి నుంచి 11.30, ఆర్టీసీక్రాస్‌రోడ్ పరిధిలో 11.30 నుంచి 12.30, రామాలయం పరిధిలో 11.30 నుంచి 12, కృష్ణానగర్ పరిధిలో 12.00 గంటల నుంచి 12.30 వరకు, ఫీవర్ ఆస్పత్రి పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30, ప్రేమ్‌నగర్ పరిధిలో 12.30 నుంచి ఒంటి గంట వరకు, బాపునగర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.30, అంబర్‌పేట పరిధిలో 1.30 గంటల నుంచి 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని వారు తెలిపారు.

కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలి: తెలంగాణ బీసీ ఐక్యవేదిక

చిక్కడపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లిలో జరిగిన ఐక్యవేదిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో 60 కోట్ల మంది బీసీలు ఉన్నారు. దేశప్రధాని బీసీ వ్యక్తి అయి ఉండి కూడా కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖను లేకపోవడం బాధాకరమన్నారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ప్రతి ఏటా దేశబడ్జెట్‌లో బీసీలకు రూ. 2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. బీసీఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ దశరథం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మున్నూరు కాపులకు చోటు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక హైదరాబాద్ అధ్యక్షులు రాజేష్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం

బర్కత్‌పుర, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అడ్మిన్ ఎస్ఐ కె.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం. శ్యామ్‌బాబా మందిర్ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై 60 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉండగా స్థానికులు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. అనారోగ్యంతో చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.